క్లుప్తంగా...

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



జియాగూడ: శ్రీ నృత్య డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జియాగూడలోని చారిత్రక రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భరతనాట్య ప్రదర్శన జరిగింది. 'అదివో.. అల్లదివో', 'బ్రహ్మమొక్కటే.. పర బ్రహ్మమొక్కటే'వంటి ఆధ్యాత్మిక గీతాలపై జరిగిన నృత్య ప్రదర్శన భక్తులను, ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అత్తాపూర్ లక్ష్మీరామ్ హారన్ అపార్ట్‌మెంట్‌కి చెందిన, ధృతిక గురువు గౌరీ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కేశవ స్వామి మహారాజ్ 341వ పుణ్యతిథి వేడుకలు



జియాగూడ: జియాగూడలోని చారిత్రక సంత్ శ్రీ కేశవ స్వామి మహారాజ్ (సజీవ సమాధి) పుణ్యతిథి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు శనివారం అయిన 341వ పుణ్యతిథి వేడుకలను దండే మహారాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి సజీవ సమాధికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, అఖండ హారతి, అన్నదానం జరిగింది. పెద్ద ఎత్తున వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పి.శంకర్‌రావు, టీడీపీ నాయకులు నర్సింగ్‌రావు, ఎ.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి హేయం

యాకుత్‌పురా: ఏపీలోని పోన్నూరులో న్యాయవాది బేతాళ ప్రకాష్‌రావుపై దాడి చేసిన పోలీసులపై ప్రభుత్వం వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోన్నూర్ పట్టణ పోలీసులు అకారణంగా ప్రకాశరావుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన సీఐ రవికిరణ్, ఎస్సై రాజకుమార్‌లపై ఏపీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

హర్షయానం పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత హర్షవర్ధన్ రచించిన హర్షయానం పుస్తకావిష్కరణ సభ శనివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ యాత్రా విశేషాలతో కూడిన పుస్తకాన్ని తీసుకురావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్స్‌లర్ ఎన్.గోపి, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ పాల్గొన్నారు.

మేరు క్రికెట్ లీగ్ ప్రారంభం

మేరు కులస్థులు అన్ని రంగాలతో పాటు క్రీడా రంగంలోను రాణించాలని రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. నిజాం కళాశాల మైదనంలో రెండురోజుల పాటు జరుగుతున్న మేరు క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మేరు సంఘం ప్రతినిధులు కీర్తి రాజగోపాల్, పొన్నం అశోక్, మాడిశెట్టి లక్ష్మీనారాయణ, శాంతికుమార్, నర్సింగ్, ఓజల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తలసేమియా రక్తదాన శిబిరం

చార్మినార్: అగర్వాల్ సమాజ్ తెలంగాణ, హైదరాబాద్ కట్‌పీస్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్, హోల్‌సేల్ ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సహకారంతో ఘాన్సీబజార్ మార్కెట్‌లోని సూరజ్ భవన్‌లో రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. రక్త రుగ్మతైన తలసేమియాతో బాధపడుతున్న చిన్నాల సౌకర్యార్థం రెండు రోజులపాటు జరిగిన ఈ రక్తదానం శిబిరం శనివారం ముగిసింది. దాతల నుంచి మొత్తం 314 యూనిట్ల రక్తాన్ని సేకరించి తలసేమియా, సికిల్ సెల్ సొసైటీకి అందజేశారు. శిబిరంలో తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్ర కాంత్ అగర్వాల్‌తోపాటు అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు మనీష్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తం అగర్వాల్, కోశాధికారి నవీన్ అగర్వాల్, గౌరవ కార్యదర్శి కపూర్ చంద్, హైదరాబాద్ కట్ పీస్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్, ఆర్ట్ సిల్క్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లకీ సేవ ఊరేగింపు

చాంద్రాయణగుట్ట: వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజా పూల్‌బాగ్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారంరాత్రి పల్లకీసేవ ఊరేగింపు కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ బొశెట్టి లెనిన్ బాబు ఆధ్వర్యంలో ఊరేగింపు, ఆలయ అర్చకులు మోహనాచార్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం నిర్వహించిన కుడారై మహోత్సవంలో ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, సెట్విన్ మాజీ డైరెక్టర్ కొప్పుల ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మజా.. లోకల్ మాంజా!

- తీరొక్క రంగుల్లో ఆకట్టుకుంటున్న వైనం
- చైనా మాంజాపై నిషేధం... పలువురి అరెస్టు
- పాతబస్తీలో దేశీయ మాంజాలకు పెరిగిన గిరాకీ



గుల్జార్‌హౌస్‌లో పతంగుల దుకాణం వద్ద వివిధ రకాల మాంజాలు

చార్మినార్: ఎగిరే గాలిపటానికి దారమే ఆధారం. వాటిని ఎగిరేసేటప్పుడు దారానికి ముందు కొద్దిగా మాంజాను ఉపయోగించడం తప్పనిసరి. మాంజా లేనిదే ఎదుటి వారి పతంగులను కట్ చేయలేం. మాంజాల తయారీకి పాతబస్తీ ప్రధాన కేంద్రం. ఇక్కడ తయారైన మంజాలను ఖరీదు చేయడానికి నగరానికి చెందిన యువకులే కాకుండా శివారు జిల్లాలవారు సైతం ఉత్సాహం చూపుతారు. కొన్ని కుటుంబాలు కేవలం పతంగుల సీజన్‌లో మాత్రమే మాంజాలను తయారు చేస్తుండగా... మరికొన్ని కుటుంబాలు ఏడాది పొడవునా వీటినే తయారు చేసి విక్రయిస్తుంటారు. గతంలో చైనా మాంజాలకు భలే గిరాకీ ఉండేది. చైనా మాంజాలను ప్రభుత్వం నిషేధించడంతో దేశీయ మాంజాలకు గిరాకీ పెరిగింది. అయినప్పటికీ కొంత మంది అక్రమంగా చైనా మాంజాలను విక్రయిస్తుండటంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెద్ద ఎత్తున దాడులు నిర్వహించి 14 కేసులు నమోదు చేసి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఇక గతేడాది 49 కేసులు నమోదు చేసి 61 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 37,02,280 విలువ చేసే చైనా మాంజాలను స్వాధీనం చేసుకున్నారు.

మాంజాల తయారీ విధానం

సుప్రీం, ఆకాశ్, సి–28, పాండ, వర్ధమాన్, గన్ తదితర రకాలలో లభించే దారాలను ముందుగా ఎంపిక చేస్తారు. ఈ దారాలను సమాంతరంగా కట్టి ప్రత్యేకంగా తయారు చేసిన దారానికి రుద్దుతారు. మాంజా తయారు చేయడానికి గాజు పెంకులు, అన్నం, జిగురు, కలబంద, బ్రహ్మజెమ్ముడు తదితర పదార్థాలను వినియోగిస్తారు. వీటన్నింటిని కలిపి ముద్దగా తయారు చేస్తారు. అవసరాన్ని బట్టి కలర్‌లను వినియోగిస్తారు. ఈ విధంగా తయారైన ముద్దను దారానికి రుద్దడంతో మాంజా తయారవుతుంది.

రకరకాలుగా...

చైనా మాంజాలపై నిషేధంతో హైదరాబాదీ మాంజాలకు గిరాకీ పెరిగిందని కాలికమాన్‌లోని ఒక పతంగుల దుకాణం యజమాని తెలిపారు. మాంజాలాను 'గీటి'లుగా విక్రయిస్తారు. ఒక్కో గీటి 45 మీటర్లుంటుంది. మోతియా, గంధక్, ఫెరోజ్, టీలా, హరా, కాళ్కీ, ఎర్రగులాబి, కౌంలా, కాలా, అండ, డిస్కో, రేడియం తదితర రకాలుంటాయి. వీటిలో పాండా, సి–28 మాంజాలకు ఎక్కువగా గిరాకీ ఉంటుంది.

అర్ధరాత్రి వరకు అనుమతించాలి

సంక్రాంతి పర్వదినం వరకే తమ వ్యాపారాలు కొనసాగుతాయనీ, పండుగకు ఇక తక్కువ రోజులు మాత్రమే ఉండటంతో ప్రతిరోజు రాత్రి పొద్దుపోయే వరకు వ్యాపారాలను కొనసాగించేటట్లు అనుమతించాలని పతంగుల వ్యాపారులు కోరుతున్నారు. పతంగుల పండగొచ్చిందంటే చాలు... చిన్నారులు ఉరుకులు పరుగులు తీస్తారు. యువతీ–యువకులు ఎంతో సంబరపడతారు. సెలవులొస్తే చాలు రోజంతా వాటి వెంటే ఉంటారు. సంక్రాంతి పండుగ దగ్గర పడటంతో నగరంలో పతంగుల క్రయవిక్రయాలు జోరందుకున్నాయి.

మసీదుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఫారూఖ్ అశ్రఫ్ మసీదు నిర్వాహకులు

గోల్కొండ: మసీదుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండలోని ఫారూఖ్ అశ్రఫ్ మసీదు నిర్వహణ కమిటీ వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత పురాతనమైన మసీదుల్లో ఫారూఖ్ అశ్రఫ్ మసీదు ఒకటని అన్నారు. మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హరూన్‌ఫరాన్, అబ్దుల్ రహీం, వజీఉజ్ జమా సిద్దిఖీ తహసీన్ పాషా, తౌఫిక్ తదితరులున్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: పండుగలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయనను శ్రీ గోల్కొండ జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబా సన్మానించారు. బోనాలతోపాటు ఇతర పండుగలను శాంతియుతంగా నిర్వహించేలా సయ్యద్ ఫయాజ్ పటిష్టమైన చర్యలు తీసుకున్నారని సాయిబాబాచారి అన్నారు. కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, న్యాయవాది వాణిశ్రీ, మహంకాళీ ఆలయ పూజారి సురేష్‌చారి, మల్లేష్‌చారి, ఏసీపీ కార్యాలయ ఐటీ సెల్ విభాగానికి చెందిన వీరయ్య పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను కలిసిన ఆశావర్కర్లు

గోల్కొండ: నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆశా వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శనివారం నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశా వర్కర్ల వేతనాన్ని 18 వేలకు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం చేపట్టే వివిధ సర్వే కార్యక్రమాల్లో ఆశావర్కర్లను వినియోగించుకుంటున్నారని, వారి సమస్యలను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విన్నవించారు. ఆయనను కలిసిన వారిలో సీఐటీయూ నాంపల్లి కన్వీనర్ సి.మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు లతారాణి, తారాబాయి, రీటా తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన



డ్రైవర్లను సన్మానిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్, శ్రీనివాస్, రమేష్

యాకుత్‌పురా: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు మీర్‌చౌక్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ నయీముద్దీన్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఆయన సిబ్బందితో కలిసి ఎంజీబీఎస్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు తరలించిన డ్రైవర్లను సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాసోత్సవాల నేపథ్యంలో వాహన ప్రమాదాల నివారణ చర్యలపై ఆర్టీసీ డ్రైవర్లకు సూచనలు చేశామన్నారు. మొదటి రోజు కోర్టులు, ఆసుపత్రులు, పాఠశాలల ప్రాంతాలను సైలెంట్ జోన్లుగా గుర్తించి వాహనదారులు హారన్ కొట్టకుండా నిశ్శబ్దంగా వెళ్లాలని వివరించామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంజీబీఎస్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ఫలక్‌నుమా డిపో మేనేజర్ రమేష్, ఎస్సైలు అమర్‌నాథ్ రెడ్డి, నగూర్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్ స్కూల్ ఎడ్యుకేషన్ యూనియన్



పదోన్నతి పొందినవారిని సన్మానించిన అధ్యక్షులు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ తదితరులు

అబిడ్స్: విద్యాశాఖ ఉద్యోగులకు అండగా ఉండి వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తామని టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ అధ్యక్షుడు కేఆర్ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ అన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. డీఈఓ కార్యాలయంలో కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అధికారులు ఎస్.చారి, అనురాధ పదోన్నతి పొందారు. వారిని టీఎన్జీఓస్ యూనియన్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో కేఆర్ రాజ్‌కుమార్, భాస్కర్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు అంచెలంచెలుగా పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి ప్రేమ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ జయంతి రెడ్డి, పబ్లిక్ సెక్రెటరీ ఫిరోజ్ అహ్మద్, ఇతర నాయకులు ప్రియదేవ్ ఠాకూర్, ముజాహీద్ అహ్మద్, జి.రాజ్‌కుమార్, విజయలక్ష్మీ, సుగుణారెడ్డి, శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజేందర్, అర్చన, మంజు, రేణుక, లావణ్య పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల ఆవరణలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది అందులో గొబ్బెమ్మలు పెట్టి భోగిమంటలు వేశారు. చిన్నారులు హరిదాసు వేషాధారణలో వచ్చి అలరించారు. విద్యార్థుల తల్లులకు గోరింటాకు, ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యావేత్తలు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ.నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి ఘనంగా నివాళి



నివాళులర్పిస్తున్న పీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా

గన్‌ఫౌండ్రీ: మాజీ దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా, ఉపాధ్యక్షులు కుమార్‌రావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: ఢిల్లీ నుంచి నగరానికి విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంచందర్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదరి చంద్రశేఖర్, కార్యదర్శి కపిల్ బరాబరిలు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన కార్యాలయంలో పూలబొకే అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

స్ఫూర్తి ప్రదాత వివేకానంద

చార్మినార్: నవ భారత స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని ప్రొఫెసర్ డాక్టర్ ఏలూరు యాదయ్య కొనియాడారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ సిటీ కళాశాల శాఖ అధ్యక్షులు జితేందర్ ఆధ్వర్యంలో 162 స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శనివారం సిటీ కాలేజీ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రొ.డా.ఏలూరు యాదయ్య అతిథిగా ప్రొ.శంకర్ నాయక్, ప్రొ.ఝాన్సీ పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఏబీవీపీ చార్మినార్ నగర కార్యదర్శి రవి, విద్యార్థి నాయకులు సందీప్, సంతోష్,శివ శంకర్, సాకేత్ కీర్తి పాల్గొన్నారు.



పాఠశాలల్లో ముగ్గుల పోటీలు



శ్లోకా స్కూల్‌లో పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు, కుటుంబ సభ్యులు



జియాగూడ సరస్వతి విద్యానికేతన్ స్కూల్‌లో రంగోలీలో పాల్గొన్న డైరెక్టర్ బలరాజ్ కాలే



కార్వాన్ శివశంకర క్రాంతిభవన్ రంగోలీ పోటీల్లో మహిళలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

జియాగూడ: జియాగూడ శాంతినగర్ శ్లోకా ది స్కూల్‌లో శనివారం రంగోలీ పోటీలు ఘనంగా జరిగాయి. స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ నాగేశ్వర్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థినులు, వారి తల్లులు పెద్ద ఎత్తున పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందినవారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ రతన్ ప్రకాష్ జైస్వాల్, తిర్మల్‌రావు, అన్వేష్, వైస్ ప్రిన్సిపల్ అమితా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్‌లో...

కార్వాన్‌లో శనివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలను శివశంకర క్రాంతిభవన్ అధ్యక్షుడు పడాల అనంతకృష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. ఇందులో సరస్వతి శిశుమందిర్ ఏజీ లక్ష్మీ, ఏడీవై స్కూల్ నుంచి వైభవ్ జైన్ న్యాయనిర్ణేతలుగా వ్యవహించారు. శివశంకర్, క్రాంతి సేవా సమితి మహిళా విభాగం ఎ.భారతి పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: రాజ్యాధికారం ద్వారానే కులాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర రావు అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పాతనగర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో గౌలిపురా శ్రీరామచంద్ర దేవాలయం వద్ద శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మల్లేపల్లి ఐటీఐ మాజీ ప్రిన్సిపాల్ గంటా జ్యోతిరాణి, తిరుపతి శివకుమార్, చుక్క అశోక్, మడిగల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!



కె.ఎస్.ప్రసాద్ వర్మ, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్

చాంద్రాయణగుట్ట: సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు ఇంట్లోని విలువైన వస్తువులు, నగదును బ్యాంక్ లాకర్లలో దాచుకోవాలని ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ సూచించారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచడం ... బయట గేట్‌కు లోపల నుంచి తాళం వేయడం.. ఇంట్లో ముందు గదిలో లైట్ వేసి ఉంచడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరికి వెళ్లేటప్పుడు నమ్మకమైన వారికి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు... వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఇంటి తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేసి వెళ్లాలని సూచించారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే డయల్–100 సమాచారం ఇవ్వాలన్నారు. ఊరుకు వెళ్లిన విషయం సోషల్ మీడియా, స్టేటస్‌లో షేర్ చేసుకోరాదని సూచించారు. ముఖ్యంగా బలమైన తాళం వేయడంతో పాటు, కిటికీలు పూర్తిగా మూసి వేయాలన్నారు.

సాంకేతిక రంగంపై దృష్టి పెట్టాలి



విద్యార్థులకు చంద్రయాన్–3 పట్ల అవగాహన కల్పిస్తున్న నర్సోజీ, వికాస్ చంద్ర

జియాగూడ: భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎన్నో విజయాలు సాధిస్తోందని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రభుత్వ టీచర్ నర్సోజీ అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలోని కాకతీయ స్కూల్‌లో జరిగిన సాంకేతిక రంగంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ వి.వికాస్ చంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో చంద్రయాన్–3 గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదవుతోపాటు సాంకేతిక రంగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రసన్న లత, సుమీద, వందన పాల్గొన్నారు.

శ్రీ బాలరామ ప్రాణప్రతిష్ట పూజలు



పూజా కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు రాహుల్‌చంద్ర, దేవర వంశీ తదితరులు

విజయనగర్ కాలనీ: అయోధ్య శ్రీ బాలరామ ప్రాణ ప్రతిష్ట మొదటి వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు రాహుల్‌చంద్ర, దేవర వంశీ, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

రంగురంగుల ముగ్గులు ..

జియాగూడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి వేడుకలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాళ్లు నాగేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



వడ్డెర కులస్తుల సంక్షేమానికి కృషి



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు

అబిడ్స్: వడ్డెర కులస్తుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని వడ్డెర కుల సంక్షేమ సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీశైలం అన్నారు. శనివారం వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలు మంగళ్‌హాట్ ఇంద్రానగర్‌లో ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీశైలం మాట్లాడుతూ వడ్డెర కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందే విధంగా తమ సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.శ్రీనివాస్, డి.వెంకటయ్య, కె.నరేష్, కె.రాములు, బి.కిరణ్, కె.సత్తయ్య, డి.పవన్, డి.గిరి, టిల్లు కృష్ణ, శాంబి పాల్గొన్నారు.

నకిలీ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్లు విక్రయిస్తూ..



నకిలీ గోల్డ్ ఫ్లాక్ సిగరెట్ డబ్బాలతో నిందితుడు

జియాగూడ: నకిలీ గోల్డ్ ఫ్లేక్ సిగరెట్స్ అక్రమ విక్రయదారుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి రూ.11 లక్షల 22 వేల విలువ చేసే 6,600 సిగరెట్ ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సెంట్రల్ జోన్ టీమ్ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ బాషా, షాహినాయత్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్ అన్నారు. ఈ మేరకు వారు వివరాలను వెల్లడించారు. షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగంబజార్‌లో శ్రీరామ్ అగ్రస్ పేరుతో రాజస్థాన్‌కు చెందిన కమల్ కిషోర్ అగర్వాల్(50) చుడిబజార్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అడ్డదారులలో డబ్బులు సంపాదించాలని గోల్డ్ ఫ్లాక్ సిగరేట్ల స్మగ్లింగ్ ఏజెంట్లతో పరిచయం పెంచుకున్నాడు. నకిలీ సిగరేట్లను తెచ్చి పాన్‌షాప్, చిరు వ్యాపారులకు, కిరాణా షాపులకు అధిక ధరలకు అమ్ముతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు షాహినాయత్ గంజ్‌పోలీసులు నిఘా వేసి అతడిని పట్టుకున్నారు.